ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు


కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

లాలాపేట: మాజీ ప్రధాని దివంగత రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు మంగళవారం తార్నాక డివిజన్ పరిధిలో ఘనంగా నిర్వహించారు. తార్నాకలోని డిప్యూటీ మేయర్ కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. మాణికేశ్వర్‌నగర్‌లో జరిగిన వేడుకల్లో మాజీ వార్డుమెంబర్ లాజరస్ ముఖ్యఅతిథిగా పాల్గొని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల సమర్పించారు. కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వేముల శ్రీనివాస్, డీసీసీ ప్రధాన కార్యదర్శి వరికుప్పల రవి, గండికోట వెంకటేష్, ఆలకుంట లింగయ్య, జయదీప్ తదితరులున్నారు.

ఎమ్మార్పీఎస్ నేతలపై అక్రమ కేసులను ఎత్తివేయాలి


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నేతలు

కంటోన్మెంట్: ఎమ్మార్పీఎస్ నేతలపై గత ప్రభుత్వం బనాయించిన అక్రమ కేసులను ఎత్తివేయాలని ఎమ్మార్పీఎస్ కంటోన్మెంట్ ఇన్‌చార్జ్ ఇటుక శ్రీకిషన్ మాదిగ అన్నారు. దివంగత ఎమ్మార్పీఎస్ నాయకురాలి సంస్మరణ సభ సందర్భంగా నమోదైన కేసులో భాగంగా పలువురు ఎమ్మార్పీఎస్ నేతలు మంగళవారం సికింద్రాబాద్ కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధనకు ఎమ్మార్పీఎస్ 30 ఏళ్లుగా అలుపెరగని పోరాటం చేసిందన్నారు. ఈ క్రమంలోనే రాష్ట్ర మహిళా నాయకురాలు దర్శనాల భారతి పోలీసుల తోపులాటలో మృతి చెందిందన్నారు. ఆమె సంస్మరణ సభ సందర్భంగా పలువురు ఎమ్మార్పీఎస్ నేతలపై కేసు నమోదు చేశారని అన్నారు. ఎమ్మార్పీఎస్ కల నెరవేరే వేళ భారతి మాదిగ సహా ఎందరో అమర వీరులు భౌతికంగా దూరం కావడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో మాదిగ మహిళా సమాఖ్య రాష్ట్ర నాయకురాలు జేపీ లత మాదిగ, ఎమ్మార్పీఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు చెన్నూరు సమ్మయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ నేతలు కొటిరే స్వామి, రాజు, నరేశ్, అంజన్న తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహ పునః ప్రతిష్ఠ


రాజీవ్ గాంధీ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు

అమీర్‌పేట: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా అమీర్‌పేట బౌద్ధ నగర్‌లో ఆయన విగ్రహాన్ని పునః ప్రతిష్ఠించారు. మంగళవారం జరిగిన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, సనత్‌నగర్ ఇన్‌చార్జి కోట నీలిమ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలను త్యాగం చేసిన గాంధీ కుటుంబాన్ని ప్రజలు ఎన్నటికీ మరిచిపోరన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అమీర్‌పేట డివిజన్ అధ్యక్షులు ఎస్.ఎస్. శ్రీనివాస్‌రావు, సీనియర్ నేత కృష్ణయాదవ్, ఎస్.ఎస్.రెడ్డి, విశాల్ సుదం, గౌస్, ఐవాన్ వాజ్, కమల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌లో ఉచిత వైద్య శిబిరం


ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ బుద్ధభవన్‌లో మంగళవారం తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ కార్యాలయంలో సిబ్బందికి ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో టీఎస్‌ఎస్‌పీఎఫ్ డీజీ డాక్టర్ అనిల్‌కుమార్, ఆరోగ్యభద్రత సెక్రెటరీ ఎన్. త్రినాథ్, కమాండర్ టి. దేవదాస్, అధికారులు సి. జంగయ్య, సీహెచ్ పవన్‌కుమార్, బీఎస్ రావు తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణపై ఆర్డినెన్స్ తేవాలి

అమీర్‌పేట: తెలంగాణలో రిజర్వేషన్ల వర్గీకరణపై ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకువచ్చి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాదిగల పెద్దన్నగా నిలవాలని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. మంగళవారం అమీర్‌పేటలోని నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచన విధానాలు అమలయ్యేలా సుప్రీం కోర్టు తీర్పునిచ్చిందన్నారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్, ఇతర పెద్దలకు మాదిగల తరుపున ధన్యవాదాలు తెలిపారు. రిజర్వేషన్ల వల్ల మాదిగలు, మాదిగ ఉపకులాలకు ఒరిగిందేమి లేదన్నారు. వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించడం తనకెంతో ఆనందం కలిగించిందన్నారు. దీనిపై ప్రత్యేక ఆర్డినెన్స్‌ను తెచ్చే విధంగా మంత్రులందరూ సీఎంకు మద్దతుగా నిలవాలని కోరారు. తగాదాలకు పోకుండా సుప్రీం కోర్టు తీర్పును అందరూ గౌరవించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ప్రసాద్ మాదిగ, సురేందర్ మాదిగ పాల్గొన్నారు.

కొనసాగుతున్న వైద్య విద్యార్థుల నిరసన

అమీర్‌పేట: కోల్‌కతాలో యువ పీజీ వైద్యురాలిపై అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ వైద్యులు చేస్తున్న నిరసనలు కొనసాగుతున్నాయి. సనత్‌నగర్ ఈఎస్ఐసీలో మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. మెడికల్ కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ బీకేగూడ, ఎస్ఆర్‌నగర్, మైత్రీవనం మీదుగా అమీర్‌పేట వరకు జరిగింది. నల్ల బ్యాడ్జిలు పెట్టుకుని ప్లకార్డులు ప్రదర్శిస్తూ సంఘటనకు బాధ్యులైన వారికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆసుపత్రుల్లో వైద్య సిబ్బందికి సరైన రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు.

గో 'దారులు'

జలదిగ్బంధంలో కాలనీలు

- జనం అతలాకుతలం
- పలు ప్రాంతాల్లో కూలిన చెట్లు
- నిలిచిన విద్యుత్ సరఫరా


అమీర్‌పేట ప్రాంతంలో జలమయమైన రహదారులు


పద్మారావునగర్ వెంకటాపురం కాలనీలో కారుపై కూలిన విద్యుత్ స్తంభం


బల్కంపేట-బేగంపేట రహదారిలోని ఆర్‌యూబీ కింద నిలిచిన నీరు..

సికింద్రాబాద్, కంటోన్మెంట్, సనత్‌నగర్: కుండపోతగా కురుస్తున్న వర్షాలతో నగరంలో జనజీవనం స్తంభించింది. రహదారులు తటాకాలను తలపిస్తున్నాయి. మంగళవారం ఉదయం కురిసిన భారీ వర్షానికి నాలాలు ఉప్పొంగాయి, లోతట్టు బస్తీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బేగంపేట బ్రాహ్మణవాడీ, మయూరిమార్గ్, అల్లంతోటబావి, చీకోటి గార్డెన్, ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్ ప్రాంతాలు నీటమునిగాయి. అమీర్‌పేట ప్రధాన రహదారి, ఎర్రగడ్డ మెట్రోస్టేషన్, ఈఎస్ఐ, ఫతేనగర్ ఫ్లైఓవర్ కింద, బల్కంపేట-బేగంపేట మార్గంలో ఆర్‌యూబీ, రసూల్‌పురా చౌరస్తా నుంచి పాటిగడ్డకు వెళ్లే రహదారి గోదారులను తలపించాయి.

పద్మారావునగర్ పరిసర ప్రాంతాల్లో భారీ వృక్షాలు నెలకూలాయి. పద్మారావునగర్ దండు నివాసంలోని రోడ్డుపై భారీ ఎత్తున వరదనీరు చేరడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వెంకటాపురం కాలనీలో భారీ చెట్టు నెలకూలి రోడ్డుపై పార్కు చేసిన కారుపై పడటంతో కారు పాక్షికంగా దెబ్బతింది. విద్యుత్ వైర్లు తెగిపోవడంతో దాదాపు 5 గంటల పాటు కరెంట్ సరఫరా లేక పద్మారావునగర్ పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.


బేగంపేట బ్రాహ్మణవాడీలో..


రసూల్‌పురా చౌరస్తా నుంచి పాటిగడ్డకు వెళ్లే దారిలో..

లోతట్టు ప్రాంతాల్లో కార్పొరేటర్ పర్యటన

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లో మంగళవారం కార్పొరేటర్ సామల హేమ పర్యటించారు. నాలా పరివాహక ప్రాంతాల్లో వరద ఉధృతి పెరిగిన సందర్భాల్లో తక్షణ చర్యలు తీసుకునేందుకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రామాలయం ప్రాంతంలో భారీవర్షం కారణంగా నేలకూలిన వృక్షాన్ని జీహెచ్ఎంసీ సిబ్బందిని రప్పించి తొలగించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్, డిజాస్టర్ టీం ప్రతినిధులు అమర్, ఖాదర్‌పాషా, పరుశరాం పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ గోపాల్‌దాస్ భజన మండలి వార్షికోత్సవం

పద్మారావునగర్: సికింద్రాబాద్‌లో సుప్రసిద్ధమైన శ్రీ గోపాల్‌దాస్ భజన మండలి 76వ వార్షికోత్సవ వేడుకలు బన్సీలాల్‌పేట్ శ్మశాన వాటికలోని గోపాల్‌దాస్ మఠంలో మంగళవారం ఘనంగా జరిగాయి. మఠం పీఠాధిపతి శరణ్‌దాస్(శంకర్ బాబు) అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మధ్యప్రదేశ్‌కు చెందిన సంత్ బోధప్రియ సాహెబ్, శ్రీ విజిత్ సాహెబ్, భీష్మశరణ్ సాహెబ్, సునీత సాహెబ్ తదితరులు పాల్గొన్నారు. నగర నలుమూలల నుంచి అనేక మంది గోపాల్‌దాస్, మాత లింగమాంబ శిష్యులు, వివిధ భజన మండలి ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలవురు ఆధ్యాత్మిక సందేశాన్ని ఇచ్చారు. లోకకళ్యాణం కోసం పాటు పడుతూ జీవన్ముక్తి పొందాలని సూచించారు. కార్యక్రమంలో మండలి అధ్యక్షులు కిషోర్ బాబు, ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌బాబు, ఆర్. మార్కెండయ్య, భగత్ శ్రీనివాస్, గణేష్, గాయకులు దిలీప్ కుమార్, నర్సింగ్‌రావు, ఎస్.వై. అశోక్, ఈశ్వర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించండి


వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

లాలాపేట: తార్నాక, హబ్సిగూడ, లాలాపేట ప్రాంతాల్లో నానాటికి తీవ్రమవుతున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని భారతీయ జనతా పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తార్నాక డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రాము వర్మ ఆధ్వర్యంలో నల్లకుంట ట్రాఫిక్ పోలీస్ అధికారులను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ఇటీవల హబ్సిగూడ సిగ్నల్‌లో ట్రక్ ఢీ కొని ఓ విద్యార్థిని మృతి చెందడం బాధాకరమన్నారు. తార్నాక- హబ్సిగూడ ప్రధాన రహదారిలో ట్రాఫిక్ రద్దీ కారణంగానే తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. హబ్సిగూడ వద్ద సిగ్నల్‌ను తొలగించి యూ టర్న్‌లను ఏర్పాటు చేయాలన్నారు. తార్నాక, లాలాపేట ప్రధాన రహదారిలో ఫుట్‌పాత్‌లు, రోడ్లపై వ్యాపారాలను తొలగించాలని కోరారు. వాహనాల నియంత్రణకు కూడళ్లలో ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను నియమించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్‌గౌడ్, ప్రకాష్‌గౌడ్, సుబ్బారావు, అనిత, అనూష, వేణు, శశి, కృష్ణమూర్తి, గండికోట నర్సింహ్మ, గోవర్ధన్, ప్రమోద్, కరుణాకర్, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కిరణ్ టీవీఎస్ ఆధ్వర్యంలో మెగా ఫ్రీడం మేళా


మెగా ఫ్రీడం మేళా ప్రారంభించిన కార్పొరేటర్ కొంతం దీపిక

రాంగోపాల్‌పేట్: కిరణ్ టీవీఎస్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా మారేడుపల్లిలోని షెనాయ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన మెగా ఫ్రీడం మేళాను మంగళవారం మోండా మార్కెట్ కార్పొరేటర్ కొంతం దీపిక ప్రారంభించారు. ఈ నెల 22 వరకు జరిగే ఈ మేళాలో కిరణ్ టీవీఎస్ ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. కార్యక్రమంలో టీవీఎస్ మోటర్స్ ఏరియా మేనేజర్ విశాల్ విక్రమ్‌సింగ్, టెరిటరీ మేనేజర్ సురేష్, కిరణ్ టీవీఎస్ ఎండీ సాకేత్, జనరల్ మేనేజర్ హరినాథ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సం సందర్భంగా పలు ప్రత్యేక ఆఫర్లను అందిస్తున్నామన్నారు. రూ.7800 అతి తక్కువ డౌన్ పేమెంట్, రూ.7800 క్యాష్ బాక్, మర్చెంటైజ్ ఆక్సరీస్ కేవలం రూ.780, వాహనం హెల్త్ చెకప్ కూడా కేవలం రూ.78తో మొదలవుతాయన్నారు. అత్యాధునిక ఫీచర్లతో కూడిన మూడు వేరియంట్లలో జూపిటర్ 125 సీసీ, అపాచీ ఆర్‌టీఆర్ 160 సీసీ 2బీ, 4వీ ఇంజిన్ వాహనాలను మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ ఆఫర్లను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.

వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి


మాట్లాడుతున్న ఏసీపీ సర్దార్‌సింగ్

రాంగోపాల్‌పేట్: వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకునేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని మహంకాళి ఏసీపీ సర్దార్ సింగ్ అన్నారు. మంగళవారం సికింద్రాబాద్ విశ్వకర్మ సంఘం హాల్‌లో మహంకాళి పోలీసుల ఆధ్వర్యంలో గణపతి మంటపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంటపాలు ఏర్పాటు చేసే సమయంలో ఎలాంటి ప్రమాదాలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భక్తుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. డీజేలకు అనుమతులు లేదని, అశ్లీల పాటలు, డ్యాన్సులు ఏర్పాటు చేసుకోకుండా భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించుకోవాలన్నారు. అనుమానాస్పద వస్తువులు, వ్యక్తులపై పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ పరశురాం, ఎస్సైలు, నిర్వాహకులు పాల్గొన్నారు.

రాంగోపాల్‌పేట్ పోలీసుల ఆధ్వర్యంలో

రాంగోపాల్‌పేట్ ఇన్‌స్పెక్టర్ నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో గణపతి మంటపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ప్యారడైజ్‌లోని హర్యానా భవన్‌లో జరిగిన సమావేశంలో ఇన్‌స్పెక్టర్ నిర్వాహకులకు పలు సూచనలు, సలహాలు చేశారు.

కొమురవెల్లి మల్లన్నకు వెండి రాఖీ

సనత్‌నగర్: బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి దేవస్థానం మాజీ పాలకమండలి సభ్యులు మంగళవారం కొమురవెల్లి మల్లన్నకు వెండి రాఖీ, పట్టు వస్త్రాలు సమర్పించారు. రేణుకా ఎల్లమ్మ అమ్మవారి సోదరుడైన కొమురవెల్లి మలన్నకు రాఖీ సమర్పించే సంస్కృతి గత ఏడాది నుంచి ప్రారంభమైంది. ఈ క్రమంలోనే ఈ ఏడాది మాజీ పాలకమండలి సభ్యులు మంగళవారం ఉదయం ఎల్లమ్మ ఆలయం నుంచి ఊరేగింపుగా రాఖీ తీసుకెళ్లారు. కార్యక్రమంలో పుష్పలతా శ్రీనివాస్, ఆంజనేయులు యాదవ్, గిరియాదవ్, సరఫ్ సంతోష్, ఉప్పల యాదగిరి, గౌతమ్, సురేష్, రోజారెడ్డి ప్రభు తదితరులు పాల్గొన్నారు.


వెండి రాఖీ, పట్టువస్త్రాలను తీసుకెళ్తున్న బల్కంపేట ఎల్లమ్మ దేవస్థానం మాజీ పాలకమండలి సభ్యులు

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి


అంబేడ్కర్ నగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. మంగళవారం ఆయన ఎనిమిదో వార్డు బొల్లారం అంబేడ్కర్ నగర్‌లో పర్యటించి డ్రైనేజీ సమస్యను పరిశీలించారు. వర్షాకాలం నేపథ్యంలో డ్రైనేజీ సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని బోర్డు సిబ్బందికి సూచించారు. నియోజకవర్గ వ్యాప్తంగా డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, పరిష్కారం దిశగా ప్రణాళిక రూపొందించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలు ప్రేమ్, మన్ను, రామ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కోదండరామ్‌కు అభినందలు



ఉస్మానియా యూనివర్సిటీ: ఎమ్మెల్సీ ప్రొ.కోదండరామ్‌కు ఓయూ విద్యార్థి జేఏసీ ఛైర్మన్ ఓరుగంటి కృష్ణ అభినందనలు తెలిపారు. మంగళవారం కోదండరామ్ నివాసంలో ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందచేసి ఎమ్మెల్సీగా గవర్నర్ కోటలో ఎంపికైనందుకు అభినందించారు.

సెల్‌ఫోన్ స్నాచర్ల అరెస్ట్

రాంగోపాల్‌పేట్: సెల్‌ఫోన్‌లు స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ఇద్దరు యువకులతో పాటు ఫోన్లు కొనుగోలు చేసిన రిసీవర్‌ను గోపాలపురం పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఉత్తర మండలం డీసీపీ రష్మీ పెరుమాళ్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాణిగంజ్‌కు చెందిన మహ్మద్ మస్తాన్ కార్మికుడిగా పని చేసేవాడు. జల్సాలకు అలవాటుపడిన అతను గతంలో గంజాయి వ్యాపారం చేస్తూ మార్కెట్, ఉస్మానియా పోలీసులకు పట్టుబడ్డారు. హత్య, హత్యాయత్నం, దోపిడీ కేసుల్లో నిందితుడిగా ఉన్న సికింద్రాబాద్‌కు చెందిన మహ్మద్ యాకూబ్ తో అతడికి పరిచయం ఏర్పడింది. ఇద్దరూ కలిసి సెల్‌ఫోన్ల స్నాచింగ్‌లకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో బాచుపల్లిలో జరిగిన సెల్‌ఫోన్ స్నాచింగ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన గోపాలపురం పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సోమవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వారిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాలు ఒప్పుకున్నారు. చోరీ చేసిన ఫోన్లను ముషీరాబాద్‌కు చెందిన సయ్యద్ మస్తాన్‌కు విక్రయించినట్లు చెప్పడంతో అతడి నుంచి 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలించారు.

ఐటీ, టెలికాం రంగాల అభివృద్ధికి ఆద్యుడు రాజీవ్

కంటోన్మెంట్: దేశంలో ఐటీ, టెలికాం రంగాల అభివృద్ధికి పునాది వేసిన ఘనత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి దక్కుతుందని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ అన్నారు. రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకుని మంగళవారం బోయిన్‌పల్లి ప్లే గ్రౌండ్ వద్ద వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జంపన ప్రతాప్ మాట్లాడుతూ.. రాజీవ్ గాంధీ హయాంలోనే దేశంలో ఐటీ, టెలికాం విప్లవానికి పునాదులు పడ్డాయని, 21వ శతాబ్దిలో దేశాన్ని కొత్త దిశగా నడిపించి దిశానిర్దేశం చేశారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు అమరెందర్ రెడ్డి, సదా, రాజు, ముఖేష్, రియాజ్, అరుణ్ యాదవ్, హరి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సీతాఫల్‌మండిలో..

సీతాఫల్‌మండి సర్కిల్‌లోని రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు జగదీశ్వర్, సురేశ్‌లాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు కవిత హాజరై పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు కల్పన, బండి అభిషేక్, జలంధర్‌రెడ్డి, విద్యాసాగర్, పాపాలాల్, సందీప్ పాల్గొన్నారు.


రాజీవ్‌గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న సిటీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కవిత


రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు


కూరగాయల ధరలు..

సనత్‌నగర్: టమాటా రూ.15, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 18, పచ్చిమిర్చి 18, బజ్జీమిర్చి 65, క్యాప్సికమ్ 55, పచ్చకాకర 20, పందిరిబీర 23, క్యాబేజీ 18, క్యారెట్ 45, దొండ 23, గుండుబీన్స్ 40, గింజ చిక్కుడు 35, గోకరకాయ 23, కీర 21, దోసకాయ 13, బీట్‌రూట్ 28, ఉల్లిగడ్డ 38, ఆలుగడ్డ 37, చామగడ్డ 23, మొరంగడ్డ 65, కందగడ్డ 50, సొరకాయ 9, పొట్లకాయ 13, అరటికాయ 10, మునగకాయ 4-5, ముల్లంగి 5-6. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఓయూలో సెక్యూరిటీని మార్చండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో మాజీ సైనిక ఉద్యోగుల సెక్యూరిటీని మార్చాలని ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి నెల్లి సత్య మంగళవారం డిమాండ్ చేశారు. మూడేళ్ల క్రితం ఉన్న సాధారణ సెక్యూరిటీని తొలగించి అధిక వ్యయానికి మాజీ సైనిక ఉద్యోగుల సెక్యూరిటీని నియమించారన్నారు. ఇందుకు గాను ఏటా రూ. కోటి చెల్లించాల్సి వస్తుందని సాధా రణ సెక్యూరిటీకి రూ.40 లక్షలు మాత్రమే చెల్లించేవారన్నారు. అధిక వ్యయంతో మాజీ సైనిక ఉద్యోగులను నియమించేంత పని ఓయూలో లేదన్నారు. వర్సిటీపై ఆర్థిక భారం పడకుండా మాజీ సైనిక ఉద్యోగుల టెండర్‌ను రద్దు చేసి సాధారణ సెక్యూరిటీ కోసం టెండరు వేయాలని కోరారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

దోమల నివారణపై అవగాహన కల్పించాలి


సదస్సులో 'ఆర్థ్రోపోడ్ బోర్న్' పుస్తకాన్ని ఆవిష్కరించిన అతిథులు..

సనత్‌నగర్: చిన్న దోమ వల్ల కలిగే దుష్పరిణామాలు తీవ్రంగా ఉంటాయని, దోమల నివారణపై ప్రజల్లో మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ప్రభుత్వ ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అదనపు సంచాలకులు డాక్టర్ అమర్‌సింగ్‌నాయక్ అన్నారు. ప్రపంచ దోమల దినోత్సవాన్ని పురస్కరించుకుని బేగంపేటలోని సర్ రోనాల్డ్‌రాస్ భవనంలో మంగళవారం 'ఏ ఫైట్ ఎగైనెస్ట్ ఫర్ ఈక్విటబుల్ డిసీజెస్' అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి హాజరైన అమర్‌సింగ్‌నాయక్ మాట్లాడుతూ ప్రజలకు అవగాహన లేకపోవడం వల్లే దోమల వృద్ధి జరుగుతుందన్నారు. దోమల కారణంగా వచ్చే వ్యాధులన్నీ నివారించబడేవేనని, అయితే దోమల నిర్మూలన పట్ల సరైన అవగాహన అవసరం అన్నారు. ప్రాణాంతకమైన మలేరియా నిర్మూలన దిశగా సర్ రోనాల్డ్‌రాస్ చేసిన పరిశోధనలను గుర్తుచేశారు. ముఖ్య ఎంటమాలజిస్ట్ డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ దోమల వృద్ధి జరిగే తీరును తెలుసుకోవడం ద్వారా వాటిని అరికట్టే వీలుంటుందన్నారు. అంతకముందు ప్రొఫెసర్ ఎం.మాధవి రాసిన 'ఆర్థ్రోపోడ్ బోర్న్' అనే మూడవ పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సదస్సు కో కన్వీనర్, సీనియర్ ప్రొఫెసర్ రెడ్యానాయక్, ప్రొఫెసర్ కరుణసాగర్, ఓయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ వీరయ్య తదతరులు పాల్గొన్నారు.

సందడిగా 'వృక్షాబంధన్' వేడుకలు

సనత్‌నగర్: బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులు మంగళవారం వృక్షా రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల వృక్షశాస్త్ర విభాగం, ఇకో క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో భాగంగా విద్యార్థినులు పర్యావరణ అనుకూలమైన రాఖీలను స్వయంగా తయారుచేసి చెట్లకు కట్టారు. వృక్షాలను కాపాడి పర్యావరణ రక్షణకు తోడ్పడతామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మావతి మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వసుధ, ఇకో క్లబ్ కన్వీనర్ ఉషారాణి, స్నేహ, వెంకటేశ్వర్లు, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.